క్లుప్తంగా

నైపుణ్యత పెంపొందించుకోవాలి



హరినాగార్జున్‌ను సన్మానిస్తున్న ఆదిత్య కళాశాల యాజమాన్యం

టెక్కలి: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలని టీసీఎస్ ఆర్‌అండ్‌డీ విభాగాధికారి హరినాగార్జున్ సూచించారు. 'సమకాలిక సాంకేతికత' అనే అంశంపై ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల భాషా ప్రావీణ్యం, పాఠ్యాంశాలపై పట్టు సాధించడం, వ్యక్తిగత ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కర్షన్, ప్రోగ్రామింగ్ నైపుణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో హరినాగార్జున్‌ను సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐబీపీసీ కో–ఆర్డినేటర్ బి.రాజేష్, ప్లేస్‌మెంట్ అధికారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అందజేత



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. పట్టుపురం పంచాయతీ కొండపేటకు చెందిన 25 కుటుంబాలవారికి మంజూరైన జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామస్తుల కోరిక మేరకు గతంలో ఎంపిక చేసిన స్థలంకంటే బాగున్న స్థలంలో పట్టాలు జారీ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు బొడుడ చెంచులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మందస: సచివాలయాల్లో జరుగుతున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు కోరారు. కొండలోగాం, మందస–2, భోగాపురం సచివాలయాల్లో జరుగుతున్న ఆధార్ సేవలను మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు అమీన్‌షరీఫ్, నగిరి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

కోటబొమ్మాళి: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకూ జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–17 నెట్‌బాల్ పోటీలో కోటబొమ్మాళి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కె.జ్యోత్స్న, యు.పావని, పి.దివ్య, జె.హేమలత, డి.హేమలత, పి.సుధారాణిలు శ్రీకాకుళం జిల్లా జట్టు తరఫున ఆడి మూడో స్థానంలో నిలిచారు. పాఠశాలకు మంచిపేరు తెచ్చిన బాలికలను ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం, ఆర్.రమణమ్మ అభినందించారు.

చిన్నారి వైద్యానికి సాయం

వజ్రపుకొత్తూరు: తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన చిన్నారి పి.హాసీష్ వైద్యానికి మన యవతరం సేవా సమితి ప్రతినిధులు మంగళవారం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న యువతరం సభ్యులు విరాళాలు సేకరించి బాధితుని కుటుంబ సభ్యులకు అందజేసి అండగా నిలిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఇస్కలపాలెం విద్యార్థి ప్రతిభ

సోంపేట: ఇస్కలపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి అంబటి హేమరాజు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి వంద మీటర్ల రిలే పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హేమరాజును ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ప్రధానోపాధ్యాయిని కె.జయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు మనీషా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయండి

సంతబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలవసంతరెడ్డి అన్నారు. వడ్డితాండ్ర, హెచ్ఎన్ పేట గోవిందపురం, సంతబొమ్మాళి, చిన్నతుంగాం సచివాలయాల్లో గృహసారథులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల సచివాలయ కన్వీనర్ ఎం.భాస్కరరెడ్డి, నాయకులు ఎం.అప్పారావు, కె.సతీష్ పాల్గొన్నారు.

దోమల నివారణ యంత్రాలు పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని 21 పంచాయతీలకు అవసరమైన దోమల నివారణ యంత్రాలను మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధితో పాటుగా ఇతర ప్రమాదకరమైన విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామారావు, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిట్ట ఆనంద్ తదితరులున్నారు.

ప్రవర్తన గౌరవంగా ఉండాలి

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ఇచ్ఛాపురం: ఆదర్శ పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న సిబ్బంది



నందిగాం: బాలికల జీవన విధానంపై పాట పాడుతున్న విద్యార్థినులు



టెక్కలి: ఏపీ ఎంజేపీ పాఠశాలలో మాట్లాడుతున్న బాలికలు



కంచిలి: సేవ్ గర్ల్స్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



ఇచ్ఛాపురం రూరల్: బాలికకు బాక్సింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్న హెచ్ఎం సుహాశ్‌చంద్

టెక్కలి: బాలికలు, మహిళల ప్రవర్తన ఎదుటి వారికి గౌరవంగా ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగానికి చెందిన అధ్యాపకులు బేగం, శిరీషా సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఏపీఎంజేపీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తగత పరిశుభ్రత, నైతిక ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికల పరిరక్షణపై పలువురు విద్యార్థినులు ప్రసంగించారు.

కత్తివరం పాఠశాలలో..

కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సేవ్ గర్ల్స్ నినాదాలు చేస్తూ విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.ఈశ్వరరావు, మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం పట్టణంలో..

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆవరణలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్, ప్రభుత్వోన్నత, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలతో పాటు శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో కార్యక్రమాలు జరిగాయి. ఆదర్శ పాఠశాలలో తైక్వాండో కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బాలికలకు ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన పి.సంగీత, ఎ.ఝాన్సీలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, ప్రైవేటు పాఠశాల చైర్మన్ కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

నందిగాం: బాలికలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని నందిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిబాబు అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో బాలికలు ఎలా నడుచుకోవాలో వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల కోసం విద్యార్థినులు పాడిన పాట ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని హెచ్ఎం కొత్తపల్లి సుహాశ్‌చంద్ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలన్న అంశంపై బాలికలకు కరాటేలో మెలకువలు నేర్పించారు.

సమస్యలు పరిష్కరించి పథకాలు అందించండి



నందిగాం: వృద్ధుడికి పింఛన్ మంజూరు కోసం డీఆర్‌డీఏ పీడీతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- పెద్దతామరాపల్లి సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నందిగాం: సాంకేతిక పరమైన సమస్యలు పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. పెద్దతామరాపల్లి సచివాలయ పరిధి గొల్లూరు పంచాయతీ సొంఠినూరు, చిన్నారిగోకర్లపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అందజేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సొంఠినూరు గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి కోనేరుకు మెట్లు, శ్మశాన వాటికకు రహదారి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ్ ఏర్పాటు చేయాలని, కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. మదనగోపాల సాగరం లిఫ్టును బూర్జగుడ్డి నుంచి దేవర చెరువు వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గాటూరు పోలయ్యకు సాంకేతిక కారణాలతో పింఛన్ మంజూరు కావడం లేదని.. వృద్ధాప్యంతో ఉన్న అతనికి పింఛన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో డీఆర్‌డీఏ పీడీతో ఫోన్‌లో మాట్లాడి పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పైలాడ లావన్న, నాయకులు యర్ర చక్రవర్తి, జద్యాడ జయరాం, తమిరె ఫాల్గుణరావు, కొంకి చలపతి, రోణంకి ఢిల్లేశ్వరరావు, తమిరె బలరాం, నాగా రామారావు , చంద్రుడు, లక్ష్మణ్, రట్టి నాగరాజు, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆ నాయకులది అతిథి పాత్ర

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- మున్సిపాలిటీలో 'గడప గడపకు మన ప్రభుత్వం



మహిళ సమస్య వింటున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసకు కొంతమంది రాజకీయ నాయకులు విజిటర్స్(అతిథి) పాత్ర పోషించడానికి వచ్చి వెళ్తుంటారని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 21వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు అతిథులుగా వచ్చి వెళ్తుంటారన్నారు. దీనికి కారణం వారు స్థానికులు కాకపోవడమేనన్నారు. ఇక్కడ ఉన్న సమస్యలు ఏమీ వారికి పట్టవన్నారు. తాము మాత్రం ఇక్కడే పుట్టి.. ఇక్కడే పెరిగి.. ఇక్కడే సేవలు అందిస్తున్నామన్నారు. అనేక సమస్యలపై ఇక్కడ పోరాటం చేశామని చెప్పారు. ప్రజల కష్టసుఖాలు తమకు తెలుసునన్నారు. ఇక్కట్లు, వెనుకబాటు, ఎలా అణగదొక్కారో తెలుసుకున్నామన్నారు. ఇప్పటికైన తమ దారికి అతిథి నాయకులు అడ్డురావద్దని హితవు పలుకుతున్నామన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకున్నాం

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకున్నామని మంత్రి చెప్పారు. రూ. వంద కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. 21వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. రూ.16 లక్షలతో శారదానగర్ నుంచి రామక్రిష్ణ మఠం వరకు రోడ్డు నిర్మించామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అప్పయ్యదొర రోడ్డులో రూ.65 లక్షలతో సీసీ రోడ్డు, ఒంకాంతి వీధిలో రూ. ఏడున్నర లక్షలుతో సీసీ రోడ్డు, వివేకానంద మార్గ్‌లో రూ.9 లక్షలతో రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు సమస్యగా ఉండటంతో రూ.28 లక్షలతో 28 స్తంభాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్‌లు మీసాల సురేష్ బాబు, బోర క్రిష్ణారావు, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్‌కుమార్, విప్ శంకర్‌పండా, ఆస్పత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, తహసీల్దారు మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ రాజగోపాలరావు, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమమే ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- పాత్రకొండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సోంపేట: పాత్రకొండలో వంట చేసుకుంటున్న వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సోంపేట: పాత్రకొండలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్

సోంపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పాత్రకొండ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా విజయ, సాయిరాజ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద ప్రజలందరికీ మేలు జరిగిందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందజేశారన్నారు. వలంటీరు వ్యవస్థతో ప్రతి కుటుంబానికి ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి నూతన ఒరవడి సృష్టించారన్నారు. సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తులు చేసుకుంటే అర్హులైన వారికి పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రజల సంక్షేమానికి నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్ ఖగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు బినోద్ చంద్ర పండా, పార్టీ నాయకులు గోకర్ల ధర్మారావు, మోహనరావు, శిలగాన భాస్కరరావు, సనపల కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

కంచిలి: రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని తహసీల్దార్ ఎస్.హైమావతి స్పష్టం చేశారు. కుంబరినౌగాం, ముండ్ల, డోలగోవిందపురం ఆర్‌బీకేల పరిధిలో ఆమె మంగళవారం పర్యటించారు. ఆయా చోట్ల మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని రైతులకు భరోసా ఇచ్చారు. కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను తహసీల్దార్ సమీక్షించారు. మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, వీఆర్వో క్రిష్ణారావు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటిన మంకినమ్మ ఆలయ ప్రతిష్ఠ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు ఆవరణలో వచ్చేనెల ఒకటో తేదీన మంకినమ్మతల్లి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మల్లా రామేశ్వరరావు దంపతులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు పాల్గొంటారన్నారు.

కంచమ్మతల్లికి బంగారం, వెండి విరాళం

కంచిలి: కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారికి ఎస్.ఆర్.సి.పురం గ్రామానికి చెందిన రత్నాల భాస్కరరావు కుటుంబం పావు తులం బంగారం, వెండి గంటను విరాళంగా ఇచ్చారు. వీటిని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిల ఆనంద్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గణప పాపారావు, వంకల ఉమాపతి, అర్చకుడు కిరణ్ ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ కె.రామారావు అన్నారు. ఈఓపీఆర్డీ బడియా రాజేశ్వరరావుతో కలసి పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పంచాయతీలో ఉన్నటువంటి నిధుల్ని ఖర్చు చేయాలన్నారు.

ఆర్‌బీకేని పరిశీలించిన విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్

కోటబొమ్మాళి: వాండ్రాడ రైతు భరోసా కేంద్రాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రామారావు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌బీకేల పనితీరు పరిశీలనలో భాగంగా ప్రాంతీయ నిఘా అధికారి సురేష్‌బాబు ఆదేశాల మేరకు తనిఖీ చేపడుతున్నట్లు రామారావు చెప్పారు. రైతులకు అందుతున్న సేవలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఇచ్ఛాపురంలో 2,59,712 మంది ఓటర్లు

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నూతన ఓటర్లతో కలిపి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 2,59,712 మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికల ఉప తహసీల్దార్ శ్రీహరిబాబు వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీలో 75,445 మంది, కవిటి మండలంలో 61,860, కంచిలిలో 54,553, సోంపేటలో 67,854 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ

కంచిలి: తలతంపర పంచాయతీ పరిధి కాకర్లపుట్టుగ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి హామీ ఇచ్చారు. 'గుడ్‌మార్నింగ్ తలతంపర' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సర్పంచ్, మిగతా కార్యవర్గసభ్యులు మంగళవారం కాకర్లపుట్టుగ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సిమెంటురోడ్లు నిర్మించాలని, వీధిలైట్లు అమర్చాలని, ఇద్దరు లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు విడుదల చేయించాలని స్థానికులు కోరారు. వీటిని అతిత్వరలో పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

గృహ నిర్మాణాలు పరిశీలిన

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో నిర్మాణంలో ఉన్న 23 జగనన్న కాలనీల్లో ఇళ్లను జిల్లా క్వాలిటీ కంట్రోల్ సభ్యులు మంగళవారం పరిశీలించారు. 21 పంచాయతీల్లో కొనసాగుతున్న సామాజిక తనిఖీలో భాగంగా జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు, సహాయాధికారి జాకర్ల శ్రీహరిలు ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి పరిశీలించారు.

రేపటి నుంచి ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను నిషేధిస్తున్నట్టు ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వెల్లడించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ యాజమానులు, సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ సమయంలో ప్లాస్టిక్ బ్యానర్లు ప్రింటింగ్ చేస్తూ పట్టుబడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌చార్జి ఉపేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా వృత్తి సంరక్షణ దినోత్సవం

కాశీబుగ్గ: పలాస ఎల్ఐసీ బ్రాంచ్ ఆవరణంలో ఏజెంట్ వృత్తి సంరక్షణ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట బీమా జెండాను ఎగురవేశారు. ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు జినగ రాజేంద్రనాయుడు, కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, ట్రెజరర్ బి.వాసుదేవరావు, సీనియర్ ఏజెంట్లు కేపీ రామన్న, టి.కర్రన్న, బి.కోదండరావు, ఎన్.ప్రకాశరావు, సుందరరావు, శ్రీనివాసరావు, ధర్మరాజు, ప్రభు పాల్గొన్నారు.

వాహనాన్ని జాగ్రత్తగా నడపాలి

సోంపేట: వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఇచ్ఛాపురం ఎంవీఐ హరిప్రసాద్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సోంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బారువ, కవిటి ఎస్సైలు వి.సత్యనారాయణ, రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రతీ పథకం పేదలకు చేరాలి'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు

టెక్కలి: ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేదలకు చేరాలని జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని చాకిపల్లి, పెద్దసాన, గూడేం గ్రామ సచివాలయాల్లో మంగళవారం గ్రామ సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడచిన మూడున్నరేళ్ల కాలంలో గ్రామ సచివాలయాల పరిధిలో ఎంతమందికి సంక్షేమ పథకాలు అందాయో వివరాలు తెలుసుకున్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు సేకరించారు. సమావేశంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, సర్పంచ్‌లు వి.తవిటయ్య, ఎం.శంకర్, కె.కామేశ్వరరావు, ఎల్.వనమమ్మ, జి.మోహన్‌రెడ్డి, పి.సంతోషమ్మ, ఎస్.అప్పలస్వామి, గ్రామ సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు పి.శ్రీనివాస్, వి.అప్పన్న, బి.భాస్కరరావు, బైరాగి, మౌళి, ప్రకాశ్, భాను, ఎల్.త్రినాథరావు, ఎస్.హర్ష, షణ్ముఖరావు, నందయ్య, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న సాయిరాజ్ తదితరులు

కవిటి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో చక్రధర యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్‌లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టోర్నమెంట్ జరగడం ఆనందంగా ఉందన్నారు. ఉద్దానం ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తమవంతు సహకారం అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గొప్పయ్య, సర్పంచ్ నారాయణస్వామి, యువజన సంఘం అధ్యక్షుడు పొందల మురళి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పొందల కృష్ణారావు, వీఆర్వో వజ్జ గిరిబాబు, గ్రామ పెద్దలు గొండ్యాల రామమూర్తి, బార్ల జగన్నాథం, బొడ్డ మోహనరావు, పొందల కృష్ణారావు, పొందల నారాయణమూర్తి, పొందల జానకిరామయ్య, ఎస్పీ ప్రవీణ్, లండ రాఘవులు, దుదిష్టి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్‌గా బాబూరావు



నూతలపాటి బాబూరావు(చైర్మన్)



యలమంచి నీలయ్య (వైస్ చైర్మన్)

కవిటి/కంచిలి: ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకమైంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు మంగళవారం విడుదలయ్యాయి. ఏఎంసీ చైర్మన్‌గా కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన నూతలపాటి బాబూరావు, గౌరవ అధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఉపాధ్యక్షుడుగా యలమంచి నీలయ్య, సభ్యులుగా డీసీఎంఎస్ చైర్మన్ సల్ల సుగుణ, తాడి సరస్వతి, రాంపత్ని నీలవేణి, తాజుద్దీన్ ఖాన్, గేదెల దేవకి, బలగ సావిత్రి, ఎర్ర లక్ష్మి, బూర్లె రుద్రమ్మ, కంతంశెట్టి రామక్రిష్ణారావు, గుడియా క్రిష్ణసాహు, తంగుడు సందీప్ కుమార్ తదితరులున్నారు.తమ నియామకంపై నూతన కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. తమ నియామకానికి కృషి చేసిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు


- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: కొన్ని సందర్భాల్లో సాంకేతిక ఇబ్బందుల కంటే మానవ తప్పిదాల వలనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మితి మీరిన వేగం, తల్లిదండ్రుల గారాబంతో వారి పిల్లలకు ఇస్తున్న ద్విచక్ర వాహనాలు, తొందరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే తాపత్రయం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం తదితర కారణాలతో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ సామాజికి ఉద్యమం చేపట్టాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానా విధించే విధంగా పోలీస్ అధికారులకు సర్క్యులర్ పంపిస్తామన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ, కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు, ఎస్సై ఎల్.రామకృష్ణ, కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, డీన్ డి.విష్ణుమూర్తి ఉన్నారు.

ఆశ కార్యకర్తలు సక్రమంగా పని చేయాలి



నియామక పత్రాలను అందజేస్తున్న విజయ

సోంపేట: ఆశ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ పరిధిలో ఇటీవల ప్రభుత్వం ఆరుగురిని ఆశ కార్యకర్తలుగా ఎంపిక చేసింది. వీరికి నియామక పత్రాలను స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. 104 వాహన సేవల ద్వారా ఫ్యామిలీ వైద్యులను నియమించినట్టు పేర్కొన్నారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, కొర్లాం వైద్యాధికారిణి బి.సౌజన్య, మత్స్యకార డైరెక్టర్ మద్దు రాజారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం , సోంపేట, సుంకిడి, గొల్లగండి సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, నాగం భాస్కరరావు, శిలగాన భాస్కరరావు పాల్గొన్నారు.